# నా స్మృతి పథంలో

లవణం

***Title*** **:** *Naa Smurthi Pathamlo*
***Author*** **:** *Lavanam (1930-2015)*
: ATHEIST CENTRE

**వెల** : 150/-

ముద్రణ
**వాసవ్య బుక్‌హౌస్**
నాస్తిక కేంద్రం, విజయవాడ
ఫోన్ నెం: 0866 – 2472330

# 1

నేను పుట్టాను. అయితే ఫలానా తల్లితండ్రులకు పుట్టాలనిగాని, ఫలానా ఊళ్ళో పుట్టాలనిగాని, ఫలానా సమయంలో పుట్టాలని గాని, ఫలానా సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులలో పుట్టాలని గాని నేను కోరుకోలేదు. అది యాదృచ్ఛికం.

విజయనగరంలో 1930 అక్టోబరు 10వతేది మధ్యాహ్నం 3 గంటల సమయంలో మా అమ్మగారి పుట్టింట్లో సరస్వతి గారికి, గోరాగా తరువాత ప్రసిద్ధి చెందిన గోపరాజు రామచంద్రరావు గారికి రెండవ సంతానంగా, జ్యేష్ఠ పుత్రునిగా పుట్టాను. అప్పటికి మా నాన్నగారు కాకినాడ పిఠాపురం మహారాజా వారి కళాశాలలో వృక్షశాస్త్ర అధిపతిగా పనిచేస్తూ ఉండేవారు. అంతేకాదు 1928లోనే కాకినాడలోని మాలమాదిగల పేటలకు వెళ్ళి అక్కడ యువకులకు చదువు చెబుతూ అస్పృశ్యత మీద, అస్పృశ్యతను ఆచరిస్తున్న హిందూ బ్రాహ్మణ వ్యవస్థ మీద తిరుగుబాటు ప్రకటించారు. ఆ తిరుగుబాటు కారణంగా సమాజం ఆయన్ని వెలివేసింది. మా తాతగారు కులకట్టుబాట్లని అంగీకరించి కొడుకుని దూరం చేసుకున్నారు. ఆ పరిస్థితులలో మా తండ్రి తనను నాస్తికునిగా ప్రకటించుకున్నారు. అమ్మ నాన్నగారికి అండగా నిలిచింది. ఆ ప్రకటనతో నా తండ్రి, తల్లి, నాకంటే ముందుగా పుట్టిన నా అక్క కలిసి ప్రపంచంలో బహుశా తొలి నాస్తిక కుటుంబమైనారు. ఆ విధంగా తొలి నాస్తిక కుటుంబంలో జన్మించిన తొలి నాస్తిక శిశువుని అయ్యే అవకాశం నాకు లభించింది. నేను జన్మతో ఏ మతానికి చెందను. ఏ కులానికి చెందను. మానవత్వం మతాలకి, కులాలకి అతీతమని భావించే నాస్తిక తల్లిదండ్రులకు జన్మించాను.

అంతేకాదు, నా తండ్రి 1921 సహాయ నిరాకరణ ఉద్యమంలో కాలేజి చదువు మాని స్వాతంత్ర్యోద్యమంలో చేరిన వ్యక్తి. ఆనాటి నుంచి జాతీయవాది. గాంధేయ మార్గానుగామి. నాతల్లి చిన్నప్పటి నుంచే ప్రశ్నించే గుణం కలది. తన చుట్టూ ఉన్న వాతావరణం నుంచి భిన్నత్వాన్ని కోరుకునేది. 1926 లో భర్తతో కాపురం మొదలుపెట్టినపుడు తనకి తగిన జీవిత భాగస్వామి దొరికారు. అలాగే అప్పటికే జీవితాన్ని శాస్త్రీయ దృష్టితో పరిశీలించడం ప్రారంభించి, మౌఢ్యాన్ని సవాలు చేసి, హేతు తత్వాన్ని స్వీకరించిన నా తండ్రికి తగిన అర్ధాంగి దొరికింది. నేను పుట్టే నాటికి 4సం॥లుగా వారిద్దరూ కలిసి ఒక నూతన జీవిత ఉషస్సంధ్యను ఆవిష్కరించారు. ఆ నూతన జీవిత ఉషస్సంధ్యా కాంతులు నేను పుట్టిన క్షణం నుంచి నామీద ప్రసరించాయి.

నాకు పేరు ఏమి పెట్టాలనేది నాన్నగారికి సమస్య. నాకు ముందుగా పుట్టిన అక్కకు మనోరమ అని పేరు పెట్టారు. అంతకు ముందు శ్రీలంక, కొలంబోలో ఆనంద కాలేజీలో నాన్నగారు లెక్చరర్‌గా ఉండేవారు. అప్పటికి నాన్నగారిలో నాస్తిక భావాలు నెమ్మది నెమ్మదిగా సంఘటనల ఒత్తిడిలోనుంచి పరిస్థితులను చీల్చుకుంటున్నా పూర్తిగా బయట పడలేదు. అందుచేత మా అమ్మకి,

నాన్నగారికి అక్కడ పెద్దలుగా ఉండిన అసరప్ప దంపతులు మా అక్క పుట్టగానే మనోరమ అనే పేరు సూచించారు. వారి ఎడలగల గౌరవాభిమానాలతో మా అక్కకు ఆ పేరే స్థిరీకరించారు. కాని నేను పుట్టేసరికి నాన్నగారు నిర్ద్వందంగా నాస్తికుడిని అని ప్రకటించుకోవడంతో సాంప్రదాయాలను, ఆచారాలను దాటి వినూత్నంగా నాకు పేరు పెట్టాలనుకున్నారు. అటూ ఇటూ మా తాతగారి పేరు పెట్టమని ఒత్తిడి వచ్చింది. నాన్నగారు అంగీకరించలేదు. ఆయన ఆలోచనలు దేశ పరిస్థితుల వైపు మళ్ళాయి.

అప్పటికి ఆరునెలలుగా దేశమంతటా ఉప్పు సత్యాగ్రహం మహోధృతంగా సాగుతోంది. భారతదేశ మంతటా కరాచి నుంచి కన్యాకుమారి వరకు అరేబియా సముద్రతీరంలోను, కన్యాకుమారి నుంచి చిటగాంగ్ వరకు బంగాళాఖాతం తీరంలోను వేలాది పొయ్యులు పెట్టి లక్షలాది జనం సముద్రపు నీటిని మరిగించి ఉప్పు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సముద్రతీరంలో ఉప్పు నీరు ఒడ్డుకు కొట్టుకు వచ్చి ఎండకు ఎండగా తయారైన ఉప్పుని చేతితో తీసి పిడికిలితో బిగించి “మా ఉప్పు మేము చేసుకుంటాం, మా ఉప్పు మేము తింటాం.” అనే నినాదాలు దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. వందలాది స్త్రీ పురుషులపై బ్రిటీష్ పోలీసుల లాఠీలు నిరంకుశ పాశవిక నృత్యం చేస్తున్నాయి. అణగబడిన ప్రజానీకం–పురుషులు, స్త్రీలు, పిల్లలు – ఆక్రోశంతో, ఆవేశంతో, ఉద్వేగంతో జన సముద్రమై కదిలారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో అంతకు ముందు ప్రపంచం ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో పోలీసుల హింసను, దౌర్జన్యాన్ని శాంతి సహనాలతో భరిస్తూ స్వరాజ్యోద్యమ త్రివర్ణ పతాకాన్ని స్వేచ్ఛగా వాయు వీధిలో ముందుకు తీసుకుపోతున్నారు. అది ఒక చారిత్రాత్మక ఘట్టం.

అప్పుడు నేను పుట్టాను. అందుచేత ఉప్పు సత్యాగ్రహానికి చిహ్నంగా నాకు నాన్నగారు “లవణం” అనే పేరు పెట్టారు.

1930 అక్టోబరు 10వ తేది మూడు గంటల సమయంలో నేను ఒక్కడినే కాదు, ప్రపంచంలో చాలా మంది పుట్టారు. ఇండియాలోనూ చాలా మంది పుట్టారు. ఆంధ్రదేశంలోను పుట్టారు. బహుశా విజయనగరంలో కూడా ఒకరిద్దరు పుట్టి ఉండవచ్చు. నాకు ముందు మానవజాతి ఉనికి ఏర్పడినప్పటినుంచి కొన్ని వందలకోట్ల మంది పుట్టారు. దేశ కాల మాన పరిస్థితులను అనుసరించి ఎవరు ఎక్కడ పుట్టినా అందరం భౌతికంగా మానవ శిశువులుగా ఒకలాగే పుట్టాం. కాని సమాజ పరిణామ క్రమంలో ఏర్పడిన వేరు వేరు సామాజిక సాంస్కృతిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలు ఆయా శిశువులకు మతాలను, తెగలను, జాతీయతలను, భాషలను, కులాలను, ధనిక–బీద తేడాలను ఆపాదించాయి. ఈ రకంగా ఆపాదింపబడిన విషయాలను ఆ శిశువు కోరుకోలేదు. శిశువు పెరుగుతున్న కొద్ది మొదట్లో తెలియకుండాను, తరువాత తెలుసుకుంటూను ఆయా ఆపాదింపబడిన స్థితి గతులకు అలవాటు పడిపోవడం జరుగుతుంది. ప్రారంభంలో నేనూ అంతే. నేను పుట్టిన పరిస్థితులలోనే నేను పెరిగాను. అయితే నేను పుట్టిన పరిస్థితులు నావలెనే పుట్టిన ఇతర శిశువులందరికంటే భిన్నమైనవి అయ్యాయి. సాంఘికంగా వెలివేయబడి, ఆ వెలిని సంతోషంగా స్వీకరించిన తల్లి తండ్రులకు పుట్టాను. తమలాంటి వాళ్ళు, తమను సమర్థించే వారు ఒక్కరు కూడా లేకపోయినా తాము ఒంటరిగానైనా సమాజానికి మంచిది అనుకున్న మార్గాన్నే వెళతామని

కంకణం కట్టుకున్న తల్లితండ్రులకు పుట్టాను. మతాన్ని, దైవాన్ని వాటితో పాటు వచ్చే సాంప్రదాయాలను, రీతి రివాజులను, భావాలను, జీవిత విధానాన్ని త్యజించి ఒక నూతన సమాజాన్ని నిర్మించాలని ఆరాటపడుతున్న తల్లితండ్రులకు పుట్టాను. మానవత్వాన్ని, విశాలత్వాన్ని ధ్యేయంగా పెట్టుకుని తోటి మనిషిని మనిషిగా చూడాలని నిత్య జీవితంలో అను నిత్యం ప్రయత్నిస్తున్న తల్లితండ్రులకు పుట్టాను. ఏ బానిసత్వాన్నైనా సహించకూడదు. ముందుగా రాజకీయ బానిసత్వపు సంకెళ్ళను తెంచివేయాలన్న స్వాతంత్ర్య సమరయోధులకు పుట్టాను. సమాజంలోని ప్రతీ కురీతిని నిర్భయంగా ఎదిరించి సమాజాన్ని సంస్కరించాలనే సాంఘిక సంస్కర్తలకి పుట్టాను. హింసా దౌర్జన్యం కాదు సత్యాహింసలతో శత్రువును ఎదుర్కోవాలని నూతన ప్రయోగం జరుగుతున్న సమయంలో పుట్టాను. ఇవన్నీ శిశువుగా నా ఎదుగుదలపై ప్రభావం చూపాయి. నాకు ఒక ఉనికిని ఏర్పరచాయి. నేను నేనుగా నా గురించి ఆలోచించుకునే స్థితి, సమయం రాగానే లవణం అనే నేను నా చుట్టూ ఉండే మిగిలిన అందరికంటే భిన్నంగా ఉన్నానని గుర్తించాను. ఈ గుర్తింపుతో నా జీవనయానం ప్రారంభమైంది.

## 2

నాకు మూడేళ్ళ వయసులో, కుడి బుగ్గ మీద మధ్యలో మాంసం ముద్ద గట్టిపడి ఒక కణితిగా ఏర్పడింది. నా అందమైన ముఖానికి అది ఒక మచ్చ అని అందరూ భావించారు. డాక్టర్లకు చూపించారు. ఆపరేషన్ చేసి ఆ కణితిని తీసేయవచ్చు అని చెప్పారు. అయితే ఆపరేషన్ మచ్చ శాశ్వతంగా పడుతుందని మా వాళ్ళు ఆపరేషన్‌కి జంకారు. అలా మచ్చపడదని, కొంతకాలానికి అంతా మామూలుగా సర్దుకుపోతుందని డాక్టరు హామీ ఇచ్చారు. ఆపరేషన్ చేసి కణితి తొలగించారు. నాకు తెలివితేటలు వచ్చేసరికి, నా ఉనికి నేను తెలుసుకునే సరికి ఆపరేషన్ జరిగిన విషయం నాకు తెలియదు. కాని అద్దంలో చూసుకుంటే కుడి బుగ్గ మీద మచ్చ కనపడింది. ఇక శాశ్వతంగా దానిని నాకు గుర్తింపు మచ్చగా చేసుకున్నాను. ఆ పుట్టుమచ్చలు ఉన్నా, కోరితెచ్చుకున్న ఈ మచ్చే నా గుర్తింపుకు విశేష ప్రాచుర్యం పొందింది.

నాకు జ్ఞానం వచ్చేసరికి నాన్నగారు కాకినాడ నుంచి బందరు వచ్చారు. కాకినాడలో ఆయనను 1933లో నాస్తికులు అని ఉద్యోగం నుంచి తొలగించారు. ఒక సంవత్సరం ఒక ట్యుటోరియల్ కాలేజి నడిపారు. అంతలో బందరు హిందూ కళాశాల వారు, నాస్తిక ప్రచారానికి అడ్డం ఉండదని హామి ఇస్తూ, బందరులో ఉద్యోగం ఇచ్చారు. 1934 జూన్‌లో కాలేజి తెరవగానే మేము బందరు రావడం-రైలు ప్రయాణం నాకు స్పష్టంగా గుర్తు ఉన్న తొలి విషయం.

బందరులో రాగానే మేము నివాసమున్నది ఫ్రెంచ్‌పేట, నాకు ఊహ వచ్చేసరికి మా కుటుంబంలో నలుగురు పిల్లలమైనాము. అక్క మనోరమ, నేను, నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు. పుట్టిన సమయపు ముఖ్యమైన సంఘటనలపై పేర్లు పెట్టే ప్రక్రియ నాతో ప్రారంభమై, తరువాతి వారికి కూడా కొనసాగింది. అందుచేత నాకు జ్ఞానం వచ్చేసరికి నా చెల్లెళ్లు ఇద్దరు నాకు పేర్లుతోనే తెలుసు. పెద్ద చెల్లెలు 1932లో గాంధి-ఇర్విన్ ఒడంబడిక, రెండవ రౌండ్‌టేబుల్ సమావేశం

సమయంలో పుట్టినందున 'మైత్రి' అని పేరు పెట్టారు. అలాగే 1934లో పుట్టిన రెండవచెల్లెలుకి నాస్తికత్వం కారణంగా తనని ఏ విద్యాసంస్థల నుంచి తొలగించారో అదే విద్యారంగంలో మరొక విద్యాసంస్థ నాస్తిక ప్రచారానికి స్వేచ్ఛనిచ్చి తనను ఆహ్వానించినందుకు జ్ఞాపకంగాను, మరోప్రక్క జాతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి అనుకూలంగా జాతీయ విద్యావిధానము, జాతీయ విద్యాసంస్థలు రూపొందించే ప్రయత్నాలు ప్రారంభమైనందున 'విద్య' అని పేరు పెట్టారు. నాకు పైన అక్క, కింద ఇద్దరు చెల్లెళ్ళు, మధ్యలో నేను. ఊహ వచ్చేనాటికి కుటుంబంలో మా పిల్లల ఉనికి ఇది.

బందరులో మాతో పాటు మా నాన్నగారి మేనత్త, బాలవితంతువు జోగమ్మగారు ఉండేవారు. ఆమెకు నేనంటే చాలాఇష్టం. నాకు బుగ్గమీద ఆపరేషన్ చేయించినపుడు కాకినాడలో రోజూ ఆమే నన్ను ఒంటెద్దు బండిలో తన ఒడిలో పడుకోబెట్టుకుని కట్టు కట్టించడానికి ఆసుపత్రికి తీసుకువెళ్ళేదట. బందరులో నన్ను ఆమె ఒడిలో పడుకోబెట్టుకుని ముఖ్యంగా కుడి బుగ్గ మీద చేత్తో వ్రాస్తూ ఆపరేషన్ మచ్చని పదే పదే చూస్తూ ఉండేది. ఆమె దృష్టిలో ఆ మచ్చ నా అందాన్ని చెడగొట్టిందేమో! మేము బందరు వచ్చిన త్వరలోనే ఆమె చనిపోయింది. అందుచేత ఆమె జ్ఞాపకాలు నాకు ఎక్కువ లేవు. నేను చూచిన మొదటి మృతదేహం ఆమెదే. నాకు చావు అంటే తెలియదు. అప్పటికి అర్థమూ కాలేదు. అయితే ఆమెను పాడెకట్టి నాన్నగారు, ఇతర విద్యార్థులు కలసి మోసుకుని వెళ్ళడం నాకు గుర్తు. తర్వాత తెలిసిన విషయం: నాన్నగారు వెలిపడి ఉండడం చేత మా ఇంట్లో చనిపోయిన ఆ శవాన్ని మోయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అంతేకాక నాస్తికులుగా నాన్నగారు మరణానికి ప్రత్యేకమైన అలౌకిక ప్రాధాన్యత ఇవ్వరు కనుక మరణంతో ముడిపడిన ఏ కర్మకాండను నాన్నగారు జరుపరు. నాస్తికుడిగా తనను ప్రకటించుకున్న తర్వాత నాన్నగారు ఎదుర్కొన్న తొలి మరణ సన్నివేశం కూడా అదే. శవాన్ని తీసుకువెళ్ళి దహనం చేసి వచ్చారే తప్ప ఇక అందుకు సంబంధించి మా ఇంట్లో ఏ కర్మకాండా జరుగలేదు. ఇవి ఇప్పటికీ నాకు చూచాయిగా జ్ఞాపకం. నాన్నగారితో స్నేహితులు మా ఇంటికి వచ్చినపుడు ఈ విషయంపై చర్చలు జరగడం కూడా నాకు జ్ఞాపకం. ఈ మరణం తర్వాత మా తాతగారు, నాయనమ్మ మా ఇంటికి వచ్చి కొద్ది రోజులు ఉండి వెళ్ళారు. వెలివేయబడిన మా నాన్నగారిని ఒక సంవత్సరం లోపలే మా తాతగారు తిరిగి దగ్గరికి చేర్చుకున్నారు. అందుచేత నేను పుట్టేసరికి మా తాతగారు నాన్నగారితో కలిసే ఉన్నారు.

మేము బందరు వచ్చిన కొత్తలోనే నాకు మా అక్కయ్య మనోరమకు కలిపి ఒక్కసారే అక్షరాభ్యాసం చేశారు. జోగమ్మ గారి పట్టుదల మీద అది ఒక చిన్న పండగగానే జరిగింది. రామదాసు మాస్టరుగారు నాకు ఇంటికి వచ్చి రోజూ అక్షరాలు దిద్దించేవారు. అక్షరాభ్యాసం పండగ సంతోషం నాకు ఇప్పటికీ కళ్ళ ముందు ఉంది. నేను కొత్త లాగూచొక్కా తొడుక్కున్నాను. మనోరమ కూడా కొత్త బట్టలు కట్టుకుంది. కొత్త పలకల మీద మా మాస్టరుగారు చేయి పుచ్చుకుని మా చేత అ,ఆ లు వ్రాయించారు. మా మాస్టరు గారి ప్రైవేటు స్కూలులో ఉండే పిల్లలు కూడా అపుడు మా ఇంటికి వచ్చారు. మొట్టమొదట జోగమ్మగారు నాకు, మనోరమకి మిఠాయి తినిపించారు. తర్వాత మా ఇద్దరిచేత వచ్చిన పిల్లలందరికి మిఠాయి ఇప్పించారు. మాస్టరు గారికి ఒక వెండి పళ్ళెంలో లడ్డూలు, తమలపాకులు, వక్కలు పెట్టి కొత్త బట్టలతో పాటు మా చేత ఇప్పించారు.

నాజీవితంలో నాకు తెలిసి నేను జరుపుకున్న మొదటి పండగ అది. ఇపుడు వెనక్కి చూసుకుంటే ఎవరికైనా తమ అక్షరాభ్యాసం ఒక పండగ అని అనిపిస్తే ఎంత ఆత్మ గౌరవాన్ని ఇస్తుంది. ఎంత ఆత్మ స్థైర్యాన్ని ఇస్తుంది. నాకు వేరే పండగలు తెలియవు. దీపావళి రోజున మాత్రం పిల్లలు అందరూ ఊరంతా టపాసులు కాల్చుకుంటారు కనుక మాకు కూడా నాన్నగారు కాకరపువ్వొత్తులు తెచ్చి ఇచ్చేవారు. అవి కాల్చుకుని ఆనందించేవాళ్ళం. మొత్తం మీద చిన్నప్పటి నుంచి ఇతర కుటుంబాల కంటే మా కుటుంబం భిన్నంగా కనిపించేది, అనిపించేది. అయితే ఎపుడూ కూడా మాకు అందులో లోటు కనబడలేదు. ఆనందానికి, సంతోషానికి మాకు కొరత ఉండేది కాదు. ఇతర కుటుంబాలతో పోలిస్తే బహుశా సందర్భాలు వేరు కావచ్చు కాని మా సంతృప్తికి లోపం లేదు. మా పుట్టిన రోజులే మాకు పెద్ద పండగ.

మరుసటి సంవత్సరం మేము ఫ్రెంచ్ పేట నుంచి ఇంగ్లీషుపాలెంలో తాలూకా ఆఫీసు ఎదురుగా ఉన్న ఇంట్లోకి అద్దెకు మారాము. అక్కడ నాకు చాలా బాగా జ్ఞాపకమున్న పెద్ద సంఘటన, మా అమ్మను చాలా భయపెట్టిన సంఘటన జరిగింది. నాన్నగారు కాలేజి సెలవులలో ఉత్తర హిందూస్థానం టూర్‌కి వెళ్ళారు. ఆ రోజు సాయంత్రం చీకటి ప్రారంభమవుతున్న సమయంలో పిల్లల్ని అన్నానికి రమ్మంది అమ్మ. నేను "ఇప్పుడే వస్తున్నాను" అంటూ రోజూ మాదిరిగానే బట్టలు ఆరవేసుకునే దండెం కర్రను ఎగిరి రెండు చేతులతో పట్టుకుని ఒక ఊపు ఊగబోయాను. తరుచు అలా ఊగేవాడిని. ఆ రోజు దండెం కర్ర పట్టుకోగానే తాడుతో కట్టిన కర్రకి తాడు తెగింది. నేను కిందపడ్డాను. నా పెదాలు మీదుగా వెదురు కర్ర కొస రాసుకుంది. అంతే! పై పెదవి రెండుగా చీలింది. చొక్కా అంతా రక్తమయం. అమ్మా అని కేకవేసాను. వంటింట్లో నుంచి అమ్మ పరుగెత్తుకు వచ్చింది. అదే సమయంలో మా రామదాసు మాస్టరుగారు కూడా వచ్చారు. నా కేక విని ఆయనా పరుగెత్తుకు వచ్చారు. వెంటనే ఒంటెద్దు బండిని పిలిచి అన్నం తింటున్న మిగిలిన ముగ్గురిని మధ్యలోనే మాన్పించి, ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. నాకు మత్తు మందు ఇచ్చి రెండుగా చీలిన పెదవిని కుట్టారు. వారం రోజుల వరకు నేను మాట్లాడకూడదు. మాట్లాడితే పెదవి అదురుతుంది. నేను మొదటి నుంచి వాగుడు పిట్టని. డాక్టరుగారు నాకు చాలా అర్థమయ్యేటట్లు చెప్పారు. అప్పటికి 15 రోజుల ముందు నాలాగే ఒక అమ్మాయికి పెదవి తెగిందట. కుట్టినా కూడా పెదవి అతుక్కోలేదట. పెదవి అతుక్కోకపోతే మొహం ఎంత అసహ్యంగా ఉంటుందో నాకు చాలా ఫొటోలు చూపించారు. ఇంట్లో అమ్మ ఒకత్తే నేను మాట్లాడకుండా చూసుకోవాలంటే కష్టం. నాన్నగారు లేరు. అందుచేత మా రామదాసు మాస్టరుగారు పగలు ఎక్కువ సమయం నా దగ్గర ఉండి కథలు చెబుతూ నన్ను మాట్లాడనీయకుండా చూసే బాధ్యత మీద వేసుకున్నారు. మొత్తానికి నా "మౌనవ్రతాన్ని" అమ్మ, మాస్టరుగారు సమర్థవంతంగా విజయవంతం చేశారు. కుట్లు విప్పినపుడు నా పెదవి అతుక్కుంది. అదే రోజు నాన్నగారు ఊరు నుంచి వచ్చారు. కుట్లు విప్పిన రోజు నా పెదవి అతుక్కోవడం కుటుంబానికి పెద్ద పండగ. బుగ్గ మీద మచ్చ, పెదవి మీద గాటు నాకు ఏమి చేటు తేలేదు. తీపి జ్ఞాపకాలే మిగిల్చాయి.

## 3

నాకు ఏడేళ్ళ వయస్సులో నన్ను స్కూల్లో ఒక్కసారి తిన్నగా ఐదవ తరగతిలో వేశారు.

అంతవరకు నేను ఇంట్లోనే ప్రైవేటుగా చదువుకునేవాడిని. స్కూలుకు వెళ్లిన మొట్టమొదట్లోనే చాలా చేదు అనుభవం ఒకటి ఎదురైంది.

నా తరగతిలోని ప్రతీ అబ్బాయి, ప్రతీ అమ్మాయి నీ పేరు ఏమిటి అని అడిగితే లవణం అనగానే, "లవణం అంటే నీ పేరు ఉప్పా!" అంటూ నా బుగ్గలు గిల్లి, వేలు నాలిక్కి రాసుకుని "అబ్బే నువ్వు ఉప్పగా లేవే" అనేవాళ్ళు. 30–40 మంది పిల్లలు నన్ను గిల్లేసరికి రెండు బుగ్గలూ గాట్లతో వాచి, ఎర్రగా అయిపోయాయి. నాకు ఏడుపు–కోపము వచ్చాయి. నా పేరు మీద నాకు అసహ్యం వేసింది. ఆరోజు స్కూల్ నుంచి ఇంటికి వెళ్ళగానే నాకు ఈ పేరు వద్దు మార్చేయమని అమ్మ దగ్గర మారాం చేశాను.

నాన్నగారు రాగానే అమ్మ ఈ విషయం చెప్పింది. "నీకు నేను పేరు పెట్టాను. ఈ పేరు ఇష్టం లేకపోతే నీకు ఇష్టం వచ్చిన పేరు పెట్టుకో. నీకు ఏ పేరు ఇష్టం?" అన్నారు నాన్నగారు. నాకు ఏ పేరూ ఇష్టంలేదు అన్నాను. దాని మీద నాన్నగారు నీ పేరుకు అర్థం తెలుసా అన్నారు. తెలుసు. ఉప్పు కదా. అందుకే ఇబ్బంది అన్నాను. నీకు ఈ పేరు ఎందుకు పెట్టానో తెలుసా అన్నారు. నాకు తెలియదన్నాను. అపుడు నాన్నగారు నాకు పేరు పెట్టిన పరిస్థితులు అన్నీ చక్కగా వివరించారు. నాకు మిగిలినవి అన్నీ పెద్దగా అర్థం కాలేదు కాని, గాంధీగారు చేసిన ఉప్పు సత్యాగ్రహం వల్ల నాకు ఆ పేరు వచ్చిందని తెలిసింది. అంతే. ఇహ నాలో ఎక్కడలేని సంతృప్తి, ఒక నూతన ఉత్సాహం, ఒక ధైర్యం వచ్చాయి.

నేను అప్పటికే ఒక సంవత్సరంగా మా ఇంటికి వచ్చే ఆంధ్రపత్రికను రోజూ చదివేవాడిని. గాంధీగారి గురించి రకరకాల వార్తలు, ఆయన చెప్పిన విషయాలు చదువుతూ ఉంటే అవి అర్థమైనా కాకపోయినా ఒక గౌరవభావం, ఇంకా చదవాలి ఇంకా తెలుసుకోవాలి అనే ఒక కుతూహలభావం నాలో కలిగేవి. ఇంటికి వచ్చిన చాలామందితో తరుచుగా నాన్నగారు గాంధీగారి గురించి మాట్లాడటం వినేవాడిని. ఈ నేపథ్యంలో గాంధీగారితో నా పేరు ముడిపడింది అని తెలియగానే 'ఇహ పేరు మార్చుకోను. ఇదే పేరు ఉంచుకుంటాను. గాంధీగారి ఉద్యమమే నా పేరు. గాంధీగారి ఉద్యమంలో నుంచి నేను పుట్టాను' అనే ఆవేశంతో నాన్నగారి వద్ద అమ్మవద్ద సంతోషభరితంగా చిందులు తొక్కాను.

మరునాడు స్కూలుకి వెళ్ళి నా పేరుతో గాంధీగారి ఉద్యమం ఉంది తెలుసా అని తోటి పిల్లలకి చెప్పగా నేను ఆ పిల్లలందరికి పెద్ద హీరో అయిపోయాను. ఇదంతా నాకు ఒక అనిర్వచనీయమైన అనుభవం. గాంధీగారి ఉప్పు సత్యాగ్రహం గురించి నాన్నగారు నాకు చెప్పింది అంతా పిల్లలకి కథలు కథలుగా చెప్పేవాడిని. వాళ్ళు చెవి కోసుకుని వినేవాళ్ళు.

బ్రిటీష్‌వాళ్ళు మన దేశానికి వ్యాపారస్తులుగా వచ్చారు. మన దేశం మసాలాదినుసులకు, ప్రసిద్ధి. అందుచేత ఓడల్లో మసాలాదినుసులైన మిరియాలు, లవంగాలు, ఏలక్కాయలు, దాచినచెక్క మొదలైనవి, అలాగే కేరళలో పండే జీడిపప్పు బస్తాలు బస్తాలుగా మహారాష్ట్రలోను ఉత్తర కర్నాటకలో పండే ప్రత్తి బేళ్ళు బేళ్ళుగా నిండుగా వేసుకుని ఇంగ్లండ్ తీసుకుపోయేవారు. ఈ ముడిసరుకులతో ఓడలు నిండుగా ఉండి సముద్రయానానికి బరువు సరిపోయేది. కాని ఇంగ్లండు నుంచి ఓడలు

వచ్చేటప్పుడు అక్కడ మిల్లులోని బట్టలు ఇక్కడ అమ్మడానికి తీసుకువస్తే ఓడల్లో బరువు చాలేది కాదు. ఓడల్లో తగిన బరువు లేకపోతే సముద్రంలో వీచేగాలులకి ఓడలు ఒరిగి మునిగిపోయే ప్రమాదముంది. కనుక ఆ రోజుల్లో ఇసుకబస్తాలు బరువుగా ఓడల్లో వేసి తెచ్చేవారు.

ఇంగ్లండు చాలా చిన్న దేశం. భారతదేశం చాలా పెద్దది. అందుచేత ఇంగ్లండులోని ఇసుక అంతా తవ్వి తెచ్చినా మనకు ఇబ్బంది లేదు. హాస్యంగా ఆలోచిస్తే ఇసుక అంతా తవ్వేస్తూ ఉంటే ఇక ఇంగ్లండు దేశం మిగలదు. బహుశా అందుకే కాబోలు ఇసుక బదులు రాతి ఉదప్పు ఇంగ్లండు నుంచి ఓడల్లో తీసుకువచ్చి ఇండియాలో అమ్మాలనుకున్నారు. ఇంగ్లండు మధ్య ప్రాంతంలో రాతి ఉప్పు గనులు చాలా ఉన్నాయి. గనుల నుంచి రాతి ఉప్పును తీసి శుభ్రం చేసి మెత్తగా పొడికొట్టి చక్కగా ప్యాక్ చేసి టేబుల్ సాల్ట్‌గా అమ్మకానికి తెచ్చేవారు. ఇదంతా కొంత ఖర్చుతో కూడుకున్న విషయం.

కాని మనదేశంలో మూడు ప్రక్కల సముద్రం. సమశీతోష్ణం గల ఎండల దేశం. సముద్రపు నీరు ఒడ్డున లోపలకు రానిచ్చి ఎండనిస్తే చాలు ఉప్పే. బస్తాలకెత్తుకుని వాడుకోవడం. ఉప్పును ఎవరు పడితే వారు ఫ్రీగా చేసుకోవచ్చు. కనుక చాలా చౌకగా అమ్మేవారు. ఈ ఉప్పుతో పోలిస్తే ఇంగ్లండు నుంచి తెచ్చిన ధర చాలా ఎక్కువ. కనుక ఏ కొద్దిమంది బ్రిటీష్ అభిమానులో తప్ప సామాన్యులందరు మన ఉప్పే వాడుకునేవారు.

ఎంతైనా బ్రిటీష్‌వారు వ్యాపారస్తులు కదా. వ్యాపారంతో పాటు భారతదేశంపై అధికారాన్ని కూడా సంపాదించుకున్నారు. అందుచేత తమ పర్మిషన్ లేనిదే ఎవరూ ఉప్పు తయారు చేయరాదని, ఉప్పుపై బస్తాకు ఇంత అని ప్రభుత్వానికి పన్ను చెల్లించాలని కూడా భారతదేశంలో బాగానే అమ్ముడుపోతుంది. గంజి తాగి పొట్టపోసుకునే పేదవాడి మీద కూడా వాడు వాడుకునే ఉప్పుకల్లు పన్నుపోటుకి ఖరీదైపోయింది. స్వాతంత్రోద్యమాన్ని సామాన్య ప్రజల వద్దకు తీసుకువెళ్ళాలంటే అతి సామాన్యమైన ఉప్పుమీద బ్రిటీష్‌వాళ్ళు ఇంత పన్నువేశారు అని గాంధీ ప్రతి ఒక్కరికి చెప్పి స్వాంత్ర్య పోరాటంలో అతి సామాన్యులకు కూడా భాగస్తులను చేయడానికి ఉప్పుపన్ను వ్యతిరేక సాత్యాగ్రహాన్ని ప్రారంభించారు. 1921లో జరిపిన సహాయ నిరాకరణోద్యమం పై తరగతి, మధ్యతరగతి ప్రజలను మాత్రమే కదిలిస్తే ఉప్పు సత్యాగ్రహం పిసరంత ఉప్పు తినే కొసరు మనిషిని కూడా కదిలించింది. ఈ విధంగా నాపేరు వెనుక ఉన్న చరిత్ర నన్ను చరిత్రలో భాగం చేస్తోంది. అందుకే చిన్నప్పటి నుంచి కూడా గాంధేయ ఉద్యమాలు, సంఘ సంస్కరణ, నాస్తికత్వం నాతో ముప్పేటగా అల్లుకుపోయింది.

ఆ దారిలో నన్ను నేను మలుచుకోవాలి అనే భావం నాకు తెలియకుండానే నాలో ప్రవేశించింది. స్కూలులో ఇతర పిల్లలతో ఎంత కలిసి ఉన్నా ఇంట్లో నాన్నగారి వద్దకు వచ్చి మాట్లాడే పెద్దల తలుపు వెనుక నుంచుని వినాలనే తహతహ నాలో పెరిగింది. విషయం ఎక్కువ అర్థం కాకపోయినా అవన్నీ వినాలి, తెలుసుకోవాలి అనే తృష్ణ నాలో రోజురోజుకి ఎక్కువైంది. దాంట్లో భాగంగా ప్రతీ కొత్త విషయాన్ని స్వయంగా ప్రయోగం చేసి తెలుసుకోవాలి అనే భావం కూడా నాలో చోటు చేసుకుంది. దాని ఫలితాలు నన్ను నాన్నగారికి మరింత చేరువ చేశాయి.

# 4

ఏడెనిమిదేళ్ల వయస్సులో నాలో ఒక ప్రక్క అన్ని విషయాలు తెలుసుకోవాలనే జ్ఞాన తృష్ణ పెరిగితే మరొక ప్రక్క ప్రతీ విషయాన్ని ప్రయోగం చేసి పరీక్షించి చూడాలి అనే తపన కూడా పెరిగింది. ఈ రెండో విషయం నాన్నగారికి చాలా ఇబ్బందులు తెచ్చిపెట్టింది. నాన్నగారు రోజూ సబ్బు రాసుకుని రేజర్‌తో గడ్డం చేసుకునేవారు. నాన్నగారు లేనపుడు నేను కూడా ఆయనలాగే గడ్డం చేసుకోవడానికి ప్రయత్నించాను. బ్లేడును సరిగా రేజర్‌లో బిగించడం చేతకాకపోవటంతో గడ్డం తెగింది. అయితే గప్‌చిప్‌గా మొహం కడుగేసుకుని బ్రష్, రేజరు కడిగేసి దేని స్థానంలో దానిని సరిగా పెట్టేశాను. అయితే చొక్కా రక్తం మరకలు అయింది. అది చూసి అమ్మ అడిగింది. ఆ రోజుల్లో బ్లేడుతో పెన్సిల్ చెక్కుకునేవాళ్లం. అందుచేత పెన్సిల్ చెక్కుకుంటూ ఉంటే ఆ బ్లేడు గడ్డానికి తగిలి తెగిందని అబద్ధం చెప్పి మొత్తానికి బయటపడ్డాను. కొన్ని సాహసాలు అలా బయటపడడానికి వీలులేనివయ్యాయి.

నాన్నగారు బొంబాయి వెళ్ళినపుడు కొత్తరకమైన గాజుగ్లాసు తెచ్చారు. అది ఎంత ఎత్తు మీద నుంచి గచ్చు నేల మీద వేసినా, విసిరికొట్టినా పగలదు. దాని సంగతి చూద్దామని నేను గట్టిగా కొట్టి చూశాను. అది పగలలేదు. ఇంత గట్టి గ్లాసులో నుంచి మంచినీళ్ళు తాగితే నా శరీరం కూడా అలా గట్టిగా ఉంటుందనే అభిప్రాయం కలిగింది. గ్లాసు శుభ్రంగా కడిగి దాంతో గ్లాసుడు నీళ్ళు త్రాగాను. ఇక నేను గామాలాగా, కోడి రామ్మూర్తిలాగా బలశాలి అయిపోతానని ఆ క్షణంలోనే కలలుగనడం మొదలుపెట్టాను. నాన్నగారు ఎప్పుడూ ఆ గ్లాసులో నీళ్ళు వాడలేదు. ఆయన ఆ గ్లాసులో పెన్సిలు, రబ్బరు, గడ్డం చేసుకున్నాక గడ్డానికి రాసుకునే పటిక ముక్క వేసి ఉంచేవారు. నేను కూడా మంచినీళ్ళు త్రాగిన తర్వాత ఆ తడిగ్లాసులో ఇవన్నీ మళ్లీ వేసి బీరువాలో పెట్టేశాను.

సాయంకాలం నాన్నగారు కాలేజి నుంచి వచ్చాక పని మీద బీరువా తెరిస్తే ఆ బలమైన గాజుగ్లాసు చిన్న చిన్న ముక్కలుగా సుత్తితో కొట్టినట్లు విరిగిపోయి బీరువా అర అంతా చెల్లాచెదురుగా పడి ఉంది. నాన్నగారికి కోపం వచ్చింది, ఆశ్చర్యం వేసింది. ఈ గాజుగ్లాసుని నేను ఏమైనా చేశానేమో అని నన్ను అడిగారు. నాకు ఏమీ తెలియదు అని అబద్ధమాడాను. అమ్మను అడిగితే తనకీ ఏమీ తెలియదని చెప్పింది. నాన్నగారు విరిగిపోయిన గాజు గ్లాసు ముక్కలని అతి జాగ్రత్తగా పరిశీలిస్తూ పోగుచేశారు. కొన్ని ముక్కల మీద నీటితడి తగిలింది. ఇంట్లో ఏ అల్లరి పనైనా చేసేది నేనే. అందుచేత నాన్నగారు నెమ్మదిగా నన్ను బుజ్జగిస్తూ ఇందులో నువ్వు ఏమైనా నీళ్ళు పోశావా అని అడిగారు. ఇక నేను ఉండబట్టలేక జరిగింది చెప్పాను. నాన్నగారు నన్ను ఏమీ అనలేదు. కాని ఆ గ్లాసు ఎందుకు చిన్న చిన్న ముక్కలైంది అనే విషయం మీద ఆయన పరిశోధన ప్రారంభించారు. నీటి తడి, పటిక రెండూ తగిలితే ఆ కెమికల్ రియాక్షన్ అంత బలాఢ్యమైన ఆ తరహాగాజుని చిన్న చిన్న ముక్కలుగా చేసివేస్తుందని నాన్నగారు కనుగొన్నారు. ఆ విషయం నన్ను, అమ్మను కూర్చోబెట్టుకుని చెప్పారు. నా "ప్రయోగాత్మకత పరిశోధన" ఫలితం నూతన జ్ఞానంగా సమాజానికి ఇచ్చిందని తర్వాతర్వాత నా చిలిపితనానికి నేను సంతోషించాను.

నాన్నగారు కొలంబోలో పనిచేసే రోజుల్లో ఒక చిన్న పోర్టబుల్ టైప్‌రైటర్ కొనుక్కున్నారు.

ఆయన దానిమీద తరుచుగా టైప్ చేసుకుంటూ ఉండేవారు. నాకు టైపు రాదు. అయినా టైపు చేయాలనే కోరిక కలిగింది. రహస్యంగా టైపురైటర్ తీసి నాకు తోచినట్లుగా నేను దానిని వాడాలని ప్రయత్నించాను. అతి కష్టం మీద కాగితం టైపురైటర్‌లో పెట్టగలిగాను గాని ఒక్క అక్షరం కూడా టైపు చేయలేకపోయాను. ఎంత సేపు కుస్తీ పట్టినా ఫలితం లేకపోయింది. ఇహ చివరకు నిరాశపడి కాగితాన్ని తీసి టైపురైటర్‌ని మూసేసి మామూలుగా పెట్టేశాను. రెండు మూడు రోజుల తర్వాత నాన్నగారు దానిని పనిమీద తీశారు. అది చెడిపోయి ఉంది. ఒకటి రెండు సున్నితమైన భాగాలు విరిగిపోయి ఉన్నాయి. నాన్నగారు వెంటనే నన్ను పిలిచి అడిగారు. అబద్ధం చెప్పలేక ముందు మౌనంగా ఉండి తర్వాత నిజం చెప్పాను. నాన్నగారు కొంత చికాకు పడ్డారు. అయితే నన్ను ఏమీ అనలేదు. టైపురైటరు బాగు చేయించారు. నాలుగు రోజులు పోయాక నన్ను పిలిచి టైపురైటరు ఎలా వాడాలో నేర్పారు. నేర్పిన తర్వాత "నీకు టైపురైటరు వాడాలి అని ఉన్నపుడు నాకు చెప్పు. నేను దగ్గర ఉండి నీ చేత టైపు చేయిస్తాను" అన్నారు. ఆ విధంగా 8 ఏళ్ళ వయసులో టైపు నేర్చుకున్నాను. టైపింగు నాకు నేర్పకపోతే నేను ఏదో ఒక సమయంలో మళ్ళీ మళ్ళీ టైపు చేయడానికి ప్రయత్నిస్తానని, తిరిగి టైపురైటరు చెడిపోయే ప్రమాదమున్నదని నాన్నగారు గమనించారు. అందుచేత గత్యంతరం లేక నాకు నేర్పారు. నా ప్రయోగ మనస్తత్వానికి నాన్నగారి దగ్గర నేను సాధించిన తొలి విజయం అది. అంతేకాక ఆయన నా మనస్తత్వాన్ని అర్థం చేసుకుని ఆ తర్వాత ఏ కొత్త వస్తువు తెచ్చినా నాకు దాని గురించి ముందుగా వివరంగా చెప్పేవారు. దీంతో ఒక విధంగా నాకు నాన్నగారి వద్ద చనువు ఎక్కువైంది.

నాన్నగారు నన్ను చిన్నప్పటి నుంచీ పరిశీలించేవారు. మూడు నాలుగేళ్ళ వయస్సులోనే మాటలు వచ్చినప్పటి నుంచి ప్రశ్నలు వేసేవాడినట. ఆ ప్రశ్నలకి తలా తోక ఉండేవి కావు. ఏ వస్తువైనా ఇది ఇలాగే ఎందుకు ఉండాలి? మరోలా ఎందుకు ఉండకూడదు అని అడిగేవాడినట. ఏదైనా రోడ్డు అటువైపే ఎందుకు వెళ్ళాలి మరోవైపు ఎందుకు వెళ్ళకూడదు అని అడిగేవాడినట. వస్తువుల చప్పుడు విన్నప్పుడు వేరు వేరు వస్తువుల చప్పుడు వేరువేరుగా ఎందుకు ఉండాలి. అన్ని చప్పుళ్ళు ఒకలాగే ఎందుకు ఉండకూడదు అని అడిగేవాడినట. బహుశా పిల్లి కుక్కలాగా ఎందుకు మొరగకూడదు. కుక్క ఆవులాగా అంబా అని ఎందుకు అనకూడదు, ఆవు పిల్లిలాగా మ్యావ్ అని ఎందుకు అనకూడదు అని కూడా అడిగేవాడినేమో! ఎక్కువ సమయం అమ్మ దగ్గరే ఉండేవాడిని కనుక అమ్మనే అడిగేవాడిని. పనుల మధ్యలో అమ్మ చికాకుపడి విసుక్కునేది. అలాంటపుడు నాన్నగారు నువ్వు చెప్పలేకపోతే నన్ను అడగమను. వాడికి నేను చెబుతాను. అంతేగాని వాడి ప్రశ్నించే గుణాన్ని మనం అణగద్రొక్కకూడదు అని అనేవారట. బహుశా నాన్నగారు నా ఎడల చూపిన ఈ వైఖరే బాల్యం నుంచి నన్ను ఒక పద్ధతిలో జిజ్ఞాసువుగా తయారుచేసిందనుకుంటాను. ఇదే తరువాత ఎనిమిది తొమ్మిదేళ్ళ వయసులో సాంఘిక రాజకీయ విషయాలపై జిజ్ఞాసువుగా కూడా ప్రోత్సహించింది.

రోజూ సాయంత్రము, శెలవుల్లోను విద్యార్థులు చాలామంది మా ఇంటికి వచ్చేవారు. నాన్నగారితోను, అమ్మతోను అనేక విషయాలు మాట్లాడేవారు. వాళ్లందరితో నేను కూడా మాట్లాడి ఆ విషయాలు తెలుసుకోవాలని ప్రయత్నించేవాడిని. ముఖ్యంగా దెయ్యాలు, దేవతలు, మహత్యాలు,

కనికట్లు ఇతర మూఢనమ్మకాల గురించి చాలా చర్చలు జరిగేవి. అవన్నీ శ్రద్ధగా విని ఇవి అబద్ధాలే అని స్థిరీకరించుకోవడానికి నేను కూడా ప్రశ్నలు వేసేవాడిని. ప్రతీ విషయాన్ని నా శక్తి మేరకు వివరంగా అర్థం చేసుకుని, నేను మళ్ళీ తిరిగి ఎవరికైనా సమాధానం చెప్పాలని ఉబలాటపడుతూ ఉండేవాణ్ని. ఈ క్రమంలో విద్యార్థులు నా విషయంలో ఎంతో శ్రద్ధ చూపేవారు. తరుచు అమ్మని అడిగి నన్ను తమ రూమ్‌లకు కూడా తీసుకువెళ్ళేవారు. గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు అయిదారుగురు కలసి ఒక ఇల్లు తీసుకుని, ఒక ముసలమ్మ చేత వండించుకుని తినేవారు. గ్రామాలలోని తమ ఇళ్ళనుంచి అనేకచిరుతిళ్ళు తెచ్చేవారు. అవన్నీ నాకు పెట్టేవారు. ఆ ముసలమ్మలకి నేను చాలా ముద్దు ముద్దుగా కనబడేవాడిని. అవన్నీ చాలా తియ్యటి అనుభవాలు.

ఆ రోజుల్లో బందరులో జరిగే చాలా సభలకు నాన్నగారితో పాటు నేను కూడా వెళుతూ ఉండేవాడిని. మాట్లాడే విషయాలు అర్థం కాకపోయినా చాలా శ్రద్ధగా వినేవాడిని. పరిసరాలలో జరిగే విషయాలను కుతూహలంగా పరిశీలిస్తూ ఉండేవాడిని. తర్వాత ఎక్కువ కుతూహలమైనవి విద్యార్థులను గాని, నాన్నగారిని గాని అడిగి తెలుసుకునేవాడిని.

## 5

బందరులో ఒకసారి ఒక స్వాముల వారు వచ్చి ఆస్తికత్వం మీద ఉపన్యాసం ఇస్తున్నారు. స్వాముల వారు వచ్చి ఇచ్చే ఆస్తికోపన్యాసాలకు తరుచు నాన్నగారు వెళ్ళి వినేవారు. అప్పుడప్పుడు నేనూ వెళ్ళి వినేవాణ్ని. ఆ రోజు నేను కూడా వెళ్ళాను. ఉపన్యాసానికి ముందుగానే నాన్నగారు కొన్ని ప్రశ్నలు కాగితం మీద వ్రాసి స్వామిజీకి ఇచ్చారు. తమ ఉపన్యాసంలో వాటికి సమాధానం చెప్పమన్నారు. స్వామీజీకి కోపం వచ్చింది. నాన్నగారు, నేను వెళ్ళి సభలో చివర కూర్చున్నాం. స్వామీజీ సభ ప్రారంభించగానే మొట్టమొదటగా “అదుగో ఆ చివర నాస్తికులు కూర్చున్నారు. వారు వెళ్ళిపోతేనే గాని నేను ఏమీ చెప్పను” అని సభికుల వైపు వీపు తిప్పి వెనక్కు తిరిగి కూర్చున్నారు. సభలో చాలా మందికి నాన్నగారు తెలుసు. వాళ్ళు చాలా ఇబ్బంది పడ్డారు. చివరకు నాన్నగారే “నా మూలాన మీ సభ ఆగిపోకూడదు. నేను వెళ్ళిపోతాను. మీరు జరుపుకోండి” అని నన్ను వెంట తీసుకుని బయటకు వచ్చేశారు. అపుడు నాకు తొమ్మిదేళ్ళు అనుకుంటాను. ఈ సంఘటన ప్రభావం నా మీద చాలా పడింది. ఎవరైనా ప్రశ్న వేస్తే మర్యాదగా సమాధానాలు చెప్పాలి గాని భిన్నాభిప్రాయాలు కలవారు సభలో నుంచి వెళ్లిపోవాలని భీష్మించుకు కూర్చోవడమేమిటని నాకు అర్థం కాలేదు. సభని అల్లరి చేయడం తప్పు. కాని ఒక విషయం మీద ప్రశ్నలు వేసి వివరణ కోరడం జ్ఞానసముపార్జనలో భాగం మాత్రమే అవుతుంది. దానికి ఆ స్వాములవారు ఇష్టపడకపోగా అసభ్యంగా ప్రవర్తించడం నామీద చెరగని చెడుముద్ర వేసింది. నాన్నగారు ప్రతీ సభలో ఎవరు ఎన్ని ప్రశ్నలు వేసినా సమాధానాలు చెబుతారు.

నన్ను స్కూల్‌లో వేసినప్పటినుంచి ప్రతీచోట కొత్తవారు నా పేరుతోపాటు కులం అడిగేవారు. కులం అంటే ఏమిటో నాకు అసలు తెలియదు, తెలియదు అని సమాధానం చెప్పేవాణ్ని. తర్వాత తర్వాత నేను నాన్నగారితో ఈ విషయం ప్రస్తావించినపుడు కులం గురించి చెబుతూ మనకు కులం లేదని, కులం అనేది మనిషికి మనిషికి మధ్య తేడాలు ఏర్పరుస్తుందని, మనకి మానవులందరు

సమానమేనని చెప్పారు. తర్వాత నేను ఇదే విషయం ఆ ప్రశ్నకు సమాధానంగా చెప్పాను. చాలామంది నాతో వాదించేవారు. కులం లేకుండా ఎవరూ ఉండరు అని మా తాతగారి కులం చెప్పి నా కులం అదేనంటూ వాదించేవారు. మా తాతగారు ఇష్టమై కులం పెట్టుకున్నారు. నాకు కులం లేదు. నాకు కులం అక్కర్లేదు. నా దృష్టిలో మనుషులందరూ సమానమే. మా తాతగారు రోజూ నామాలు పెట్టుకుంటారు. నేను పెట్టుకోవడం లేదు గదా అనేవాణ్ని. నాతో వాదించడం వారికి సరదాగా ఉండేది. చాలా నిజాయితీగా నన్ను నేను సమర్థించుకోవడానికి కిందా మీదా పడేవాణ్ని. ఏదో విధంగా నాదే పైచేయి అనిపించేవాణ్ని. బహుశా వాళ్లు కూడా నన్ను మరీ నొక్కిపెట్టటానికి ఇష్టపడేవారు కాదేమో.

నాకు ఏడేళ్ల వయసు నుంచీ రోజూ సాయంత్రం బందరులోని అప్పటి మూడు సినిమాహాళ్లు – మినర్వా, బృందావన్, సరస్వతి టాకీస్‌లను ఒక్కసారి పరుగు పరుగున చుట్టి వచ్చేవాణ్ని. ప్రతీ ఆదివారం ఉదయం మ్యాట్నీ షోకి (తరుచు ఇంగ్లీషు సినిమాలకి) వెళుతూ ఉండేవాణ్ని. సినిమాకని నాన్నగారు నాకు నెలకు అర్థరూపాయి ఇచ్చేవారు. ఆఖరి టికెట్ రెండణాలు (అర్థరూపాయికి 8 అణాలు). ఆ రోజుల్లో అతి ఎక్కువ టికెట్ అర్థరూపాయిగా ఉండేది. ఒకసారి నాన్నగారి విద్యార్థులు కూడా అదే సినిమాకు వచ్చి అర్థరూపాయి తరగతిలో కూర్చున్నారు. విశ్రాంతి సమయంలో వారు నన్ను చూసి తమతో వచ్చి కూర్చోమని నాకు తాము అర్థరూపాయి టికెట్ తీసుకుంటామని చెప్పారు. నేను ఒప్పుకోలేదు. “ఏ క్లాసులో కూర్చున్నా చూసే సినిమా ఒక్కటే కదా, ఎక్కువ డబ్బు ఇచ్చి మీరు నాకంటే ఎక్కువ సినిమా చూడడం లేదు కదా” అని నేను నా తరగతికి వెళ్ళి కూర్చున్నాను. ఆ రోజు సాయంత్రం వారు ఇంటికి వచ్చి అమ్మకి, నాన్నగారికి ఉదయం సినిమా హాల్‌లో జరిగిన సంఘటన చెప్పి నన్ను చాలా పొగిడారు. నాకు లోపల చాలా గర్వం అనిపించినా, బయటకు మాత్రం చాలా సిగ్గు వేసింది. నాన్నగారు నాకు అర్థరూపాయే ఇచ్చేవారు కనుక దాంతో ఎక్కువ సినిమాలు చూడాలని నేను అనుకునేవాణ్ని. నాన్నగారు నన్ను సమర్థించారు.

సినిమా కరపత్రాలు సేకరించి జాగ్రత్తగా దాచి ఉంచడం నాకు పెద్ద సరదాగా ఉండేది. తర్వాత తర్వాత సిగరెట్ ప్యాకెట్ల లేబుల్స్, అగ్గిపెట్టెల లేబుల్స్ కూడా సేకరించేవాణ్ని. ఆ రోజుల్లో నాకు ఇంగ్లీషు సినిమాలలో బేబి యాక్టర్‌గా నటించిన షెర్లీ టెంపుల్ అంటే చాలా ఇష్టంగా ఉండేది. ఆమె నటించిన సినిమా వస్తే తప్పక చూసేవాణ్ని. నేను ఏ సినిమా చూసినా ఇంటికి వచ్చి దాని కథ అమ్మకు చెప్పడం నాకు ఎంతో ఇష్టంగా ఉండేది.

నేను అపుడపుడు తోటి విద్యార్థులతో కలిసి బాడ్మింటన్, ఫుట్‌బాల్ ఆడేవాణ్ని. ఫుట్‌బాల్‌లో ముఖ్యంగా ఫార్వర్ట్ పొజిషన్‌లో ఆడేవాడిని. నాకు మరో సరదా. ఇంటి నుంచి స్కూల్‌కి వెళ్ళేటపుడు, స్కూల్ నుంచి ఇంటికి వెళ్ళేటపుడు ఒక కంకరరాయిని ఎంచుకుని దానిని కాలివేళ్లతో తన్నుకుంటూ వచ్చేవాణ్ని. ముఖ్యంగా నా కుడి కాలి వ్రేళ్లన్నీ పుళ్ళు అయిపోయేవి. అయినా నేను రాయి తన్నడం మానేవాడ్ని కాదు. అమ్మకి ఈ విషయం మీద చాలా కోపం వచ్చేది. ఇప్పటికీ నేను ఎందుకలా రాయిని తన్నుకుంటూ నడిచేవాడినో నాకు అర్థం కాదు.

నాకు మరొక అలవాటు. ఏదైనా చూస్తే వెంటనే అది చేసేయాలనుకునేవాడిని. అందువల్ల ఒక విషయాన్ని చూసేటపుడే దాన్ని చేయవలసిన రీతిని కూడా మనసుకు పట్టించుకునేవాణ్ని. ఒకసారి నా చిరిగిపోయిన పుస్తకం ఒకటి బైండింగు చేయించుకున్నాను. నేను దగ్గర ఉండి అతను ఎలా చేశాడో అంతా చూశాను. ఆ తర్వాత నా పుస్తకాలు నేనే బైండింగు చేసుకున్నాను. అలాగే మరొకసారి అమ్మ గిన్నెలకు కళాయి పెట్టించింది. కళాయి ఎలా పెడతారో నిశితంగా పరిశీలించి చూశాను. దానికి కావలసిన రెండు వస్తువులు అనాసాగరం, తగరం అని తెలుసుకున్నాను. తర్వాత బజారుకు వెళ్ళి అవి రెండూ తెచ్చుకుని, ఇంట్లోని ఇతర గిన్నెలకు నేనే బొగ్గుల కుంపటి మీద వేడిచేసి కళాయిలు పెట్టాను. పనివాడు చేసినట్లు బాగా రాకపోయినా అమ్మ సంతోషించింది. ఇలాంటి పనులు ఎందుకు అని అమ్మ ఎపుడూ వెనక్కి లాగలేదు. అలాగే చెప్పులు కుట్టి బాగుచేయడం కూడా చేస్తూ ఉండేవాణ్ని.

మేము బందరులో ఉన్నపుడు ఇద్దరు తమ్ముళ్లు పుట్టారు. అంతకుముందు నలుగురి పురిటికీ అమ్మ పుట్టిల్లు విజయనగరం వెళ్ళింది. ఇపుడు ఈ పురుళ్లకు మా అమ్మమ్మే బందరు వచ్చింది. 1936 డిసెంబరులో పెద్ద తమ్ముడు పుట్టాడు. 1937 ఫిబ్రవరిలో దేశమంతటా పరిమిత ఓటింగు హక్కుతో ఎన్నికలు జరిగాయి. అపుడు ఆస్తి ఉన్నవారికి, చదువుకున్నవారికి మాత్రమే ఓటుహక్కు. బ్రిటీష్‌పాలనలో జరిగిన ఆ ఎన్నికలలో కాంగ్రెస్ మొదటిసారిగా పాల్గొంది. మద్రాసు, బొంబాయి, సి.పి.-బేరార్, ఒరిస్సా, అస్సాం, బీహార్, యునైటెడ్ ప్రావిన్సెస్, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సెస్‌లలో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ వచ్చింది. సింధు, పంజాబ్, బెంగాల్ రాష్ట్రాలలో ముస్లింలీగ్‌తో కలిసి మిశ్రమ మంత్రివర్గాలు ఏర్పరచవలసి వచ్చింది. ఇది కాంగ్రెస్‌కు ఘనవిజయం. అందుచేత అపుడు పుట్టిన పెద్ద తమ్మునికి 'విజయం' అని పేరు పెట్టారు. విజయం పుట్టేనాటికి నాకు ఏడేళ్ళు నిండాయి. కనుక వాడిని ప్రేమగా ఎత్తుకోవాలనే ఉబలాటం ఎక్కువగా ఉండేది. 6 నెలల వయస్సులో విజయాన్ని నేను ఒకసారి చంకన వేసుకున్నాను. ఆ రోజుల్లో నేను జేబులో ఎపుడూ పెన్సిల్ పెట్టుకునేవాణ్ని. అది వాడి పొట్టలో గుచ్చుకుంది. వాడు ఏడవగానే అమ్మకు ఇచ్చేసినా ఏమి జరిగిందో విషయం చాలా సేపటివరకు తెలియలేదు. ఆఖరికి నా జేబులోని పెన్సిల్ చూసి అమ్మ ఈ పెన్సిల్ గుచ్చుకుని ఉంటుంది అన్నది. నాకు ఆ పెన్సిల్ మీద కోపం వచ్చి దానిని ముక్కలు ముక్కలుగా విరగ్గొట్టి బయట పారవేశాను. విజయం దగ్గర కూర్చుని "పెన్సిల్‌ని విరగ్గొట్టి పారేశాను. ఇంక నువ్వు ఏడవకు" అని చాలాసార్లు చెప్పాను. విజయం ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు. దాని ప్రభావం నేను చాలా కాలం వరకు పిల్లలను ఎత్తుకోలేదు. పిల్లల్ని దూరంగా ఉంచి ఆడించి సంతోషించేవాణ్ని.

1939లో ప్రపంచయుద్ధం ప్రారంభమయ్యాక మరో తమ్ముడు కూడా బందరులోనే పుట్టాడు. యుద్ధ సమయంలో పుట్టడం వల్ల ఆ తమ్ముడికి 'సమరం' అనే పేరు పెట్టారు.

## 6

1936 నుంచి నాన్నగారు కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో విద్యార్థుల సహకారంతో అనేక గ్రామాలకు వెళ్ళి నాస్తిక ప్రచారం చేస్తూ వచ్చారు. 1938లో కృష్ణాజిల్లా

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Naa+Smruti+Pathamlo+Hemalatha+Lavanam](http://kinige.com/book/Naa+Smruti+Pathamlo+Hemalatha+Lavanam)**

* * *